

సిద్దిపేటలోని సమీకృత కలెక్టరేట్



చిన్నకోడూరు మండలంలోని రంగనాయకసాగర్



సిద్దిపేటలో ఏర్పాటు చేసిన ఐటీ టవర్

# స్వపరి పాలనలో నవశకం..

- నేటికీ జిల్లా ఏర్పడి ఏడు వసంతాలు పూర్తి
- మూడు రెవెన్యూ డివిజన్లు, 26 మండలాలతో జిల్లా ఏర్పాటు
- మారిన జిల్లా రూపురేఖలు.. ప్రజలకు చేరువైన పాలన
- విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాలకు పెద్దపీట

సిద్దిపేట, అక్టోబర్ 10 : సిద్దిపేట జిల్లా ఏర్పాటుతో దశాబ్దాలుగా ఇక్కడి ప్రజల కల నెరవేరింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2016 అక్టోబర్ 11న సీఎం కేసీఆర్ సిద్దిపేటను 3 రెవెన్యూ డివిజన్లు, 22 మండలాలతో కలిపి ఏర్పాటు చేశారు. పూర్వ మెదక్ జిల్లా నుంచి 13 మండలాలు, కరీంనగర్ జిల్లా నుంచి మూడు మండలాలు, వరంగల్ నుంచి రెండు మండలాలతోపాటు రెండు నూతన మండలాల్లో సిద్దిపేట జిల్లాను ఏర్పాటు చేశారు. ప్రజల పరిపాలన సౌలభ్యం కోసం మరో మూడు నూతన మండలాలు ఏర్పాటు చేయడంతో నేడు జిల్లాలో 26 మండలాలు, 3 రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. గతంలో సిద్దిపేట ప్రజలు జిల్లా కేంద్రం సంగారెడ్డికి వెళ్లాలంటే ఎంతో వ్యయ ప్రయాసలకు గురయ్యేవారు. సిద్దిపేట నుంచి సంగారెడ్డి 130 కి.మీటర్ల దూరం ఉండడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో సిద్దిపేటను జిల్లా చేయాలనే డిమాండ్ ప్రజల్లో బలంగా ఉండేది. అన్ని రాజకీయ పక్షాలు ఎన్నికల మేనిఫెస్టోలో జిల్లా ఏర్పాటు అనేది నినాదంగా మారింది. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ ప్రజల న్యాయమైన కోరికను నెరవేర్చారు. జిల్లా ఏర్పడి ఏడేండ్లు అయింది.

## సమీకృత కలెక్టరేట్, సీపీ కార్యాలయం ఏర్పాటు

సిద్దిపేట జిల్లా కేంద్రం ఏర్పాటుతో పట్టణ శివారులో విశాలమైన స్థలంలో సమీకృత కలెక్టరేట్‌ను ప్రభుత్వం నిర్మించింది. అన్ని జిల్లా కార్యాలయాలు ఒకే భవనంలో ఉండడంతో ప్రజలు తమ పనులను సులువుగా చేసుకుని వెళ్తున్నారు. కలెక్టరేట్‌కు సమీపంలో పోలీస్ కమిషనరేట్‌ను ఏర్పాటు చేయడంతో శాంతి భద్రతలు నిర్వహణ మెరుగుపడింది.

### జిల్లా ఏర్పాటుతో చేరువైన పాలన

ఒకప్పుడు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ప్రజలకు నరకం కనిపించేది. ఉదయం 5 గంటలకు సిద్దిపేటలో బస్సు ఎక్కితే సంగారెడ్డికి వెళ్లేసరికి 11గంటలు అయ్యేది. జిల్లా ఏర్పాటుతో సిద్దిపేట ప్రజలకు సంగారెడ్డి వెళ్లే బాధ తప్పింది. నూతన జిల్లా ఏర్పాటు చేసిన తర్వాత జిల్లా కేంద్రంతో ప్రభుత్వం రోడ్డు కనెక్టివిటీ పెంచింది. దీంతో వివిధ పనుల కోసం ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చి తమ సమస్యలు పరిష్కరించుకుంటున్నారు. మారుమూల ప్రాంతాలకు కెళ్లడానికి జిల్లా స్థాయి అధికారులకు చాలా ఇబ్బందిగా ఉండేది. కలెక్టర్ శివారు ప్రాంతాలకు వెళ్లడమే గగనం. దీంతో కొన్ని ప్రాంతాలపై వారికి పెద్దగా పట్టు ఉండేది కాదు. కానీ, ఇప్పుడు జిల్లాల పరిధి జిల్లా కేంద్రం నుంచి దాదాపు 50-70 కిలోమీటర్లు. దీంతో అన్ని ప్రాంతాలపై పర్యవేక్షణ పెరిగి ప్రజలకు పాలన చేరువైంది.

### ప్రజల ముగింట ప్రభుత్వ కార్యాలయాలు

గతంలో తమ పనుల కోసం జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన జిల్లాలు, కొత్త మండలాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ కార్యాలయాలకు నిర్మించింది. జిల్లా అధికారులు అందుబాటులో ఉంటున్నారు. జిల్లాలో హుస్నాబాద్, గజ్వేల్ రెవెన్యూ డివిజన్లు, ఏడు కొత్త మండలాలు ఏర్పడ్డాయి.

### అభివృద్ధిలో హై స్పీడు

సిద్దిపేట జిల్లా ఏర్పడిన నాటి నుంచి అభివృద్ధి పథంతో నడుస్తున్నది. ముఖ్యంగా జిల్లా కేంద్రం కావడంతో సౌకర్యాల కల్పన పెరిగింది. సమీకృత కలెక్టరేట్ భవనం, సీపీ కార్యాలయం ఏర్పాటుతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. సిద్దిపేట వేగంగా అభివృద్ధి చెందింది. రంగనాయకసాగర్ నిర్మాణంతో జిల్లాలో వ్యవసాయసాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. రంగనాయక సాగర్ పర్యాటక క్షేత్రంగా మారింది. రైల్వే నిర్మాణంలో సిద్దిపేట ప్రజలు కల నెరవేరింది. సిద్దిపేటలో ఐటీ హబ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

## ప్రజల దశాబ్దాల కలను నెరవేర్చిన సీఎం కేసీఆర్




### పేదవాడికి కార్పొరేట్ వైద్యం

జిల్లా కేంద్రం ఏర్పడిన తర్వాత సిద్దిపేట ఏరియా దవాఖాన జిల్లా దవాఖానగా మారడంతో పాటు మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసింది. ఈ ప్రాంత ప్రజలకు అధునాతన వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వచ్చింది. దీంతో వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులతోపాటు వైద్య సౌకర్యం ఏర్పడింది. ఇటీవల 1000 పడకల దవాఖాన ఏర్పాటు కావడంతో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. క్యాత్ ల్యాబ్ ఏర్పాటు, కాన్సర్ చికిత్స అందుబాటులోకి వచ్చింది.



### పాలన ప్రజల దగ్గరకు చేరింది



జిల్లాల ఏర్పాటుతో పరిపాలన ప్రజలకు చేరువైంది. ప్రజలు అధికారులతో సమస్యలను చెప్పుకొని పరిష్కరించుకునే వీలు కలిగింది. సీఎం కేసీఆర్ కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడంతో రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలోని ప్రతి సమస్యను తెలుసుకునే వీలుకలిగింది. గతంలో నైజాం పాలన, కాంగ్రెస్, టీడీపీ హయంలో ఇటువంటి ప్రజారంజకపాలన చూడలేదు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో వినూత్నమైన మార్పులు తెచ్చారు. కొత్త జిల్లాలతో ప్రజలు ఎంతో మేలు పొందుతున్నారు. ప్రజలకు మేలు చేసే నాయకుడే రాష్ట్రాన్ని పాలించేందుకు అర్హుడని సీఎం కేసీఆర్ రుజువు చేశారు.

*-గన్నె బాల్‌రెడ్డి, రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు, దుబ్బాక టౌన్*

### దూరం వెళ్లాల్సిన బాధలు తప్పాయి.



తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం సిద్దిపేట జిల్లా, నారాయణరావు మండలాన్ని ఏర్పాటు చేసింది. దీంతో మండల పరిషత్ కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం వచ్చి మాకు దూరం ప్రయాణించాల్సిన బాధలు తొలగిపోయాయి. మండలం ఏర్పాటు కాకముందు ప్రతి పనికి సిద్దిపేటకు వెళ్లాల్సి ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నారాయణరావుపేట మండలాన్ని ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు తాము ఎప్పుడూ రుణపడి ఉంటాం.

*-బండకాడి జనార్దన్, గుర్రాలగొంది గ్రామం*

### ప్రజల ఆకాంక్షలు నెరవేరుతున్నాయి..



సిద్దిపేట ప్రజల 30 ఏండ్ల కల రెండేండ్లలో నిజం కావ డం సంతోషాన్నిచ్చింది. దీంతో సిద్దిపేట దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాగా చరిత్ర కెక్కింది. ఈ ప్రాం తం విద్య, వైద్య, వికాస, సేవ, వ్యాపార కేంద్రంగా వికసిస్తున్నది. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ఆదర్శంగా నిలిచింది. తెలంగాణ ఆవిర్భంతోనే సిద్దిపేట జిల్లాగా ఏర్పడి ప్రజల కలలను నిజం చేస్తూ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నది.

*-గంప శ్రీనివాస్, సామాజిక సేవపరుడు, సిద్దిపేట*

### ప్రజలకు అందుబాటులో సేవలు



ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం 2016 దసరా రోజున కొత్త జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా చేర్యాల మండలంలోని కొమురవెల్లిని 9 రెవెన్యూ గ్రామాలతో నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేసింది. దీంతో ప్రజలకు సేవలు అందుబాటులోకి రావడంతో పాటు ప్రయాణ బాధలు తప్పాయి. ఎన్నో ఏండ్ల కల నెరవేరడంతో ప్రజలకు పాలన అందుబాటులోకి రావడం సంతోషంగా ఉంది. **- బొంగు రాజేందర్‌రెడ్డి, బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, కిష్టంపేట**

### ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు



కొత్త మండలాలతో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటున్నారు. గతంలో వివిధ పనుల కోసం హుస్నాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. నెలల కొద్దీ కార్యాలయం, అధికారులు చుట్టూ తిరిగేది. అక్కన్నపేట మండలాన్ని 2016లో ఏర్పాటు చేయడంతో మా గ్రామ పంచాయతీకి దగ్గర అయ్యింది. మా మైసమ్మవాగు తండాను కూడా పంచాయతీగా ఏర్పాటు చేశారు. మా సమస్యలను మా తండాల్లోనే చర్చించి, పరిష్కరించుకునే అవకాశం కలిగింది. కొత్త పంచాయతీలు, మండలాలు, రెవెన్యూ డివిజన్, జిల్లాలను ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్ కృతజ్ఞతలు.

**-భూక్యా కృష్ణనాయక్, మైసమ్మవాగుతండా జీపీ(అక్కన్నపేట**

### కొత్త జిల్లాల ఏర్పాటుతో అందరికీ మేలు



కొత్త జిల్లాల ఏర్పాటుతో అందరికీ మేలు జరిగింది. ఒకనాడు అధికారులను కలిసేందుకు ప్రజలు జిల్లాకేంద్రానికి వెళ్లి పడిగాపులు పడేది. నేడు జిల్లా స్థాయి అధికారులే ప్రజల చెంతకే వచ్చి సమస్యలు వింటున్నారు. నిజంగా ఇలాంటి పరిస్థితి వస్తుందని ఎన్నడూ ఊహించలేదు. రాకడ, పోకడలు నిజంగా సులువు అయ్యిందంటే కొత్త జిల్లాల ఏర్పాటే కారణం.

**సి. వీరసోమయ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి, హుస్నాబాద్**

### ప్రజలకు ఎంతో సౌలభ్యం



సీఎం కేసీఆర్ ప్రజల సౌలభ్యం కోసం కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారు. ప్రజలకు దూర భారం, వ్యయ ప్రయాసలు, దళారీతనం తగ్గుముఖం పడుతుంది. నూతన కార్యాలయాల ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలు పెరిగాయి. సీఎం కేసీఆర్ దూరదృష్టితో నూతంగా జిల్లాలను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది.

**-సోమగారి నాగిరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు**

### అందరికీ అభివృద్ధి ఫలాలు



కొత్త జిల్లాల ఏర్పాటుతో అభివృద్ధి ఫలాలు అందరికీ చేరుతున్నాయి. ఎంతో ముందు చూపుతో జిల్లాలను ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనున్నారు. గతంలో జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఎన్నో వ్యయప్రయాసలకు లోనయ్యేవాళ్లం. మా ఊరు గతంలో వరంగల్ జిల్లాలో ఉండేది. ఇప్పుడు సిద్దిపేట జిల్లాకు మారింది. అప్పుడు వరంగల్ జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే వంద కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసేది. ఎన్నో ఇబ్బందులు పడి, జిల్లా కేం ద్రానికి చేరుకున్న పనులు జరిగేవి కావు. కార్యాలయాల్లో పనుల కోసం రోజుల తరబడి అక్కడే ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. మాకు సిద్దిపేట జిల్లా కేంద్రం చాలా దగ్గరైంది. జిల్లా కేంద్రంలోని కార్యాలయాలలో కూడా పనులు కూడా త్వరితగతిన పూర్తవుతున్నాయి. ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పథకాల అమలును పర్యవేక్షిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు గ్రామాలను తరుచుగా సందర్శిస్తుండడంతో పాలనలో పారదర్శకత పెరిగింది. పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలను ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు.

**-ఇమ్మడి వెంకట్‌రెడ్డి, రిటైర్డు ఉపాధ్యాయుడు, బైరాన్‌పల్లి, ధూళిమిట్ట**